వేలాదిమంది వలస కార్మికులు కాలిని నమ్ముకుని సొంత ఊళ్లకి
వేలాది మైళ్లు నడిచి పోయే దుర్భర స్థితి మానవులకి ఈ నాగరిక ప్రపంచంలో
రావడం దుర్మార్గం కదా! కత్తిపూడి హైవే మీదుగా కాలి నడకన, సైకిళ్ల మీదా
రాష్ట్రాలు దాటుతున్న వారితో మాట్లాడాక ఏదైనా రాయాలనుకున్నా.
కథ కాక ఇంకేం రాయగలను!

అద్దేపల్లి ప్రభు

# 10 ఊరికే పోవాలి

అన్వర్





“ధర్మరాజు వెంట శునకము వలె మన వెనుక మరణము విడువకుండా వస్తున్నది,” అన్నాడు సీతాన్వేషి.

చెయ్యెత్తు మాత్రమే ఉన్న గానుగ మొక్కకి చేరగిలి ఉన్నాడతడు. లేత పచ్చని కొత్త ఆకులతో ఆ పడుచు గానుగ మొక్క అస్తమానూ ఉలికిపడుతోంది. ఆ చెరువు గట్టు చుట్టూ ఇలాంటి చిన్నా పెద్దా చెట్లూ... ఎండిపోయిన పొదలూ నరికేసిన మానులూ పడి ఉన్నాయి. చెరువు గట్టు మీద గుంపులు గుంపులుగా జనం కూర్చొని ఉన్నారు. కాసింత నీడ ఎక్కడుంటే అక్కడ చేరబడీ... నేల మీద వాలిపోయీ ఉన్నారు. చెరువులోని ఎర్రటి నీళ్ల మీద సూర్యుడు వందల కొద్దీ సంతకాలు పెడుతున్నాడు. గడికోమారు వెచ్చటి తేమగాలి సన్నగా వీచి పోతోంది. చెరువు పెద్దదే. సుదూరంగా ఎండిపోయిన పొలాలు కనిపిస్తున్నాయి. నీళ్లు అక్కడక్కడా ఉన్నాయి.

నీటిలో కొంగలూ, ఏట్రింత పిట్టలూ... అక్కడక్కడా కనిపించే తూటు మొక్కల దగ్గర కనిపిస్తున్నాయి. పెద్ద పెద్ద నారాయణ పక్షులు ఒంటి కాలి మీద నిలబడి చూస్తున్నాయి.

చెరువును చూడగానే అతనికి తన చిన్నతనం గుర్తొచ్చింది. దూడల్ని కాసుకునే వయసులో తమ వూరి చెరువులో ఎన్నోసార్లు ఈతలు కొట్టేవాళ్లు. కానీ మొదటిసారి ఈత యింకా రాకముందు దూడలని చెర్లోకి తోలి లోనికి వెళ్లినప్పుడు... నేల అందక మునిగిపోయాడు. భుజాలని పట్టుకొని వెచ్చని నీటి స్పర్శ ఒకటి లోనికి ముంచింది. గాలికి బదులుగా ముక్కు నుండి నీరు లోనికి పోవడానికి వచ్చింది. నోటిలోంచి నీరు గొంతులోంచి కడుపులోకి పోతోంది. కళ్ల ముందు ఒక నాచు ఆకాశం పొరలాగా కమ్ముకుంది. ఇంతలో కాలికి సిమెంటు తూర ఒకటి తగిలింది. ఒక్కసారిగా తూరని బలంగా తన్ని పైకి లేచాడు. నాచు ఆకాశం పోయి నీలపు ఆకాశం చుక్కలు చుక్కలుగా కనిపించింది. తోటి కుర్రాళ్లు జుట్టు పట్టుకుని లాగడం గుర్తొచ్చింది. నీళ్లని దగ్గి దగ్గి గొంతూ ముక్కూ కళ్లూ మండిపోయాయి.

ఎదురుగా చెరువు ఎండలో మాడిపోతూ చెమటలు కక్కుతోంది. సీతాన్వేషి చుట్టూ చూశాడు. తన కొడుకులిద్దరూ కాళ్లు నొక్కుకుంటూ

కూర్చున్నారు. కాసింత నీడ ఉన్న చోట తమతో పాటు వస్తున్న కుర్రాళ్లు వీపున బాగుల్ని తల కిందికి చేర్చి వాలిపోయి ఉన్నారు. కమిలిపోయిన ముఖాలతో రేగిపోయిన జుట్టుతో ఆడవాళ్లు పిల్లల్ని దగ్గర చేర్చుకుని కూర్చొని ఉన్నారు.

"కాస్తంత దూరంలో ఏదో ఊరుందట... ఏమన్నా తీసుంటాయో లేదో..." అంటూ సీతాన్వేషి పక్కన కూలబడిపోయాడు కిరణ్. అతని చేతిని నిమురుతూ రోడ్డు వంక చూస్తూ ఉన్నాడు సీతాన్వేషి.

"ఓయ్... పెద్దాడా... మళ్లీ కాస్తంత చల్లబడే వరకూ ఇక్కడి నించి కదిలేది లేదు," అన్నాడు కిరణ్.

అతని అరికాళ్లలో నిప్పులు వేసి కుట్టేసినట్టుంది. మొదటిరోజు నడక మొదలు పెట్టాక సాయంత్రానికి కాళ్లు బొబ్బలెక్కిపోయాయి. బయలుదేరిన పాతికమంది జనానికి కాళ్ల మీద పొరలు ఊడిపోయినట్టయిపోయాయి. పిక్కలు ముడుకులు తొడలు నడుము భుజాలు మెడ అన్నీ సలుపులే. ఆరోజు ఏడ్చినట్టు జన్మలో ఏడవలేదు. ఒకపక్క నొప్పులు, ఒకపక్క ఏమిటీ గతి ? అనే శోకం... కడుపులో శోకం... కళ్లలో శోకం... గుండెలో శోకం... శరీరంలో అణువణువూ ఏడ్చింది ఆరోజు.

ప్రతి ఒక్కళ్ల దగ్గరా చిన్నదో పెద్దదో మూట ఉంది. పోగా పోగా పై పంచె కూడా బరువెక్కుతుంది. కానీ వదిలి పారేయడానికి యిది పంచె కాదు. బతుకు... తమ బతుకంతా యిందులోనే ఉంది. తమ బతుకుని మోసుకుంటూ పోతున్నారు.

"చిన్నాయినా... కాసిన్ని నీళ్లు తాగుతావా..." అని అడిగింది విజయ.

సీతాన్వేషి తల వూపాడు.

ఆమె ఇచ్చిన నీళ్లు తాగి, "బుల్లీ యేడయే ఈ నీళ్లు..." అన్నాడు.

"అల్లదేటి చెరువు కాదా...అందుట్లోయే.."

అందరూ ఆ నీళ్లే తాగుతున్నారు.

విజయ, కిరణ్‌కి నీళ్లిచ్చింది. అతడు ఓ గుక్క తాగి, 'పూ"అని ఊశాడు.

"ఇలాంటి నీళ్లు తాగితే దార్లోనే సత్తాం," అన్నాడు.

సీతాన్వేషి వాడి వంక చూశాడు.

"ధర్మరాజు వెనక శునకములాగా మన వెనుక మరణము కూడా వస్తూనే ఉంది," అన్నాడు.

కిరణ్ ఓసారి అతడి వంక చూసి మళ్లీ పడుకున్నాడు.

సీతాన్వేషి రోడ్డు మీదికి చూస్తూ ఉండిపోయాడు.

"బతికుంటే డబ్బు ఎప్పుడైనా సంపాదించవచ్చు. ఇప్పుడు డబ్బు కాదు. బతకడం ముఖ్యం... ఇక్కడుంటే ఈ అమ్మోరితో చావడం గారెంటీ... కాబట్టి పనులన్నీ ఆపేస్తున్నాం... మీ దారి మీరు చూసుకోండి..." అని కాంట్రాక్టరు చెప్పినప్పుడే కాళ్ల

కింద నేల కదిలిపోయింది. దేశమంతా ఒక మాయదారి అమ్మోరమ్మ వాలింది. ఇళ్లన్నీ తలుపులు మూసుకున్నాయి. రోడ్లన్నీ వాహనాలని మూసేశాయి. ప్రతి ఒక్కడి మూతి మీదికీ మాస్కు వచ్చి నోరు మూసేసింది. దేశమంతా యిళ్లలోకి దూరి తలుపులు మూసేసుకుంది.

మరి మనమేటి చేయాలి?

యిక్కడ ఈ మహానగరంలో మనం కట్టిన యిళ్లున్నాయి. కానీ మనకి లేవు కదా.

మరి మనమేటి చేయాలి?

రైలు లేదు. బస్సు లేదు. లారీ లేదు. ఆటో లేదు. బండి లేదు. సైకిలు లేదు. దేశమంతా లోలోపలికి ముడుచుకుని పోయి, మన్ని బయటకి గెంటేసింది.

మరి మనమేటి చేయాలి? ఎలా చావాలి? బతికుంటే ఎప్పుడైనా ఆడు డబ్బు సంపాదించగలడు. కానీ మనకేటి? బతకాలంటేనే రోజూ పని చేయాల్సినోళ్లం. ఈ మహానగరంలో మనకి బతుకంటూ ఏమీలేదు. చావు కూడా లేదు. మనూరికి పోడమే దారి.

ఈ మాట అనుకోవడంతోనే కడుపులో బల్లలాంటి బెంగొకటి పెరిగిపోయింది విజయకి. తమ ఊరు దేవైడం మొదలుపెట్టింది.

పేటలోకి పోవాలంటే కాలవ మీది వంతెన దాటి పోవాల్సిందే... వంతెన దాటి డౌన్లోకి దిగి కాలవ గట్టెమ్మట నడుచుకుంటూ పోతే రెండో తాటి పట్టా దాటగానే వచ్చేదే మనిల్లు. సరిగ్గా ఇంటెనకే కాలవ... దొరికితే చేపలు పట్టొచ్చు. కావాలంటే స్నానాలూ చేయొచ్చు. తనూ హారిక, దుర్గ, పావని అందరం క్లోజ్ ఫ్రెండ్స్. స్కూలుకి పోయినా చర్చికి పోయినా ఏడికి పోయినా ఒకటే జట్టు. లేవగానే ఒకళ్లనొకళ్లు లేపుకుని ఆ తెల్లారుజామున పంటకాలవ పక్కన నడుచుకుంటూ, కబుర్లాడుకుంటూ పోయే వాళ్లు. బళ్లో మాస్టారి చుట్టూ సారుగారండీ అంటూ అస్తమానూ తిరిగేవాళ్లు.

విజయ వాళ్ల నాన్న పోవడంతో ఆమె బాగా కుంగిపోయింది.

ఊళ్లో పనుల్లేక అతడు బొంబాయో.. ఒరిస్సానో ఎక్కడికో వెళ్లి వచ్చేవాడు. వచ్చినప్పుడల్లా కూతురి కోసం కొడుక్కోసం ఏవేవో తెచ్చేవాడు. కాస్తో కూస్తో తాగేవాడు గానీ ఇంట్లో ఒకమూల ముడుచుకుని పడుకునేవాడు. పని కోసం వెళ్లి ఆరునెలల క్కానీ రానన్నవాడు ఒకసారి రెణ్ణెల్లకే వచ్చేశాడు. ఏదో జబ్బు చేసింది. గవుర్నమెంటు ఆసుపత్రికి పోతే అదేదో లివరు జబ్బన్నారు. నెలా పదేను రోజులకి పోయాడు. ఎంతో బాగా చదివే విజయని తొమ్మిదో తరగతిలోనే చదువు మానిపించి కిరణ్‌కిచ్చి పెళ్లి చేసేశారు.

ఊళ్లో ఏదైనా పని దొరకడం చాలా కష్టమే. యింతకు ముందు కోతలకనీ, ఊడ్పులకనీ పోయేవాళ్లు. ఇప్పుడు మిషన్లు రావడంతో పని లేదు.

మొగోళ్లు ఆటోలు నడుపుకోడం... అది లేనోల్లు అక్కడక్కడా పనులు ఎతుక్కోవడం... కిరణ్ కి ముందు నించీ బిల్డింగ్ పనులకి వెళ్లడం అలవాటు. అతను సంవత్సరంలో ఆరేడు నెలలు ఈ పనుల్లోనే తిరిగేవాడు. ఊరికొచ్చి కొన్నాళ్లుండి మళ్లీ పోయేవాడు. పెళ్లయ్యాక పిల్లల్ని అమ్మమ్మ దగ్గర వదిలి పనుల్లోకి ఇద్దరూ పోయే వాళ్లు. ఇప్పుడు భూమి బద్దలాసిపోయినట్టు కరోనా వచ్చిపడింది. నించున్న ఊరు మంది కాకుండాపోయింది. బతకడానికే కాని వూరు చావుకేడ ఉంటది. ఈ మాట అనుకోగానే ఊరు పోవాలనే బెంగ పెరిగిపోయింది.

పిల్లల మీద దేవేస్తుంది. చెరువు గట్టున చెరువునీ చెరువు మీది గాలినీ చూస్తూ వున్న విజయకి ఊరునీ పిల్లల్ని తలుచుకోగానే దుఃఖం పొంగుకొచ్చింది. బతికి ఊరికి పోతామా...

చున్నీతో ముఖం తుడుచుకుంటూ చెరువు కేసి చూస్తూండిపోయింది. దూరంగా ఎండిపోయిన పొదల దగ్గర ఒకటీ రెండూ కొంగలు కనిపిస్తున్నాయి. ఆ ఒడ్డు మీద పెద్ద రావిచెట్టు ఆకులు గంటల్లా వూగుతున్నాయి. చెరువు పెద్దదేగానీ సకం సకం ఎండిపోయి సకం సకం బీటలు వారిపోయి ఉంది. వూళ్లో ఎన్ని కొంగలుం డేవో అనుకుంది.

పక్కనొచ్చి కూర్చుంది హారిక.

"పిల్లలు ఆకలనీ... దాహమనీ ఏడ్చేస్తున్నారే..." అంటూ. అని విజయ ముఖం చూసి, "ఏ... ఏమైంది."

తల అడ్డంగా తిప్పి, "మనూరు గుర్తొచ్చింది."

హారిక తలవూపి విజయ భుజాల చుట్టూ చేతులు వేసి, "నాకూ అలాగే ఉంది. అడుగడుక్కీ గుర్తొస్తోంది. ఏడుపొస్తోంది," అంటూ చెరువుకేసి చూస్తూ ఉండిపోయింది.

రోడ్డు మీద ముగ్గురు వ్యక్తులు సైకిళ్లు తొక్కుకుంటూ వస్తున్నారు. వాళ్లు చెరువు కట్ట చూసి ఆగి సైకిళ్లని గట్టు ఎక్కించి చదునుగా ఉన్న చోట స్టాండు వేశారు. వీపుకి ఉన్న చిన్న బ్యాగుని కూడా తీసి సైకిల్‌కి తగిలించారు. కాస్త నీడ ఉన్న చెట్టు కింద కూర్చున్నారు. కిరణ్ వాళ్లని చూసి లేచి వాళ్ల దగ్గరకి వెళ్లాడు. కాసేపు వాళ్లతో మాట్లాడి వచ్చాడు.

"ఎక్కడోళ్లురా వాళ్లు..." సీతాన్వేషి.

"మద్రాసు నించి వస్తున్నారు. బేకరీల్లో పనిచేస్తారట. ఒరిస్సా పోవాలంట."

"సైకిళ్లేడియో బానే సంపాయించారే..."

"సంపాయించడమేముంది... ఉన్న డబ్బులన్నీ పెట్టి సైకిళ్లు కొనేశార్ట... ఇక సవారీ మొదలు..." అని, "పెద్దాడా ఆళ్లు కూడా నీకులాగే యెళ్లగలమా... దార్లోనే పోతామా... అని ఆళ్లి సచ్చిపోతున్నారు."

సీతాన్వేషి సైకిళ్ల దగ్గరి వాళ్లని చూశాడు. తలని నిలువుగా కాసేపు వూపి ఇలాటి కష్టం ఒకటి నా జీవితంలోనే కాదు, నేను విన్న జీవితాలలో కూడా లేదు అనుకున్నాడు. వూరి మొదట్లో కంచెలేసి నీళ్లడిగితే పొమ్మన్న వూర్లు గుర్తొచ్చి అతని కళ్లలో నీళ్లు తిరిగాయి. 'ధర్మరాజు వెంట...' అనబోతుండగా కిరణ్ కళ్లు పెద్దవి చేసి,

"ఓరిడీయవ్వ... నోరిప్పితే దరమరాజు... సునకం అంటూ సంపేత్తన్నాడు... పెద్దాడా ఈసారి అలాగన్నావనుకో... సునకానికో దరమరాజుకో అప్పజెప్పిపోతాం..." అని నవ్వాడు.

మోటారు సైకిలు మీద ఇద్దరు కుర్రాళ్లు రోడున పోతూ వీళ్లని చూసి ఆగి బండి దిగి గట్టు మీదికి వచ్చారు. కిరణ్‌తో మాట్లాడారు.

కిరణ్ అందరితోనూ అన్నాడు. "పక్కూరి దగ్గర బోజనాలు పెడుతున్నారంట... ఓ గంట నడాలి."

అందరూ లేచారు.

సీతాన్వేషి విజయ చేతిని ఆసరా చేసుకుని లేచాడు. తల దిమ్మెక్కిపోయి కళ్లు గిర్రున తిరిగి కూలబడిపోయాడు.

"ఓలమ్మ... ఏటైంది?" అంటూ వచ్చింది హారిక.

ఒక్క నిముషం కూర్చుండిపోయాడు సీతాన్వేషి.

కాస్త దూరంలో నిలబడి చూస్తున్న ఒరియా కుర్రాడు కిరణ్‌ని,

"బీమారీ హై..." అడిగాడు.

కిరణ్ తల అడ్డంగా తిప్పుతూ, "ఏం బీమారీరా నాయినా... తిండి లేదు. నీళ్లు లేవు. కొనుక్కుందామంటే కొట్లు లేవు... ఆడి కాళ్లు చూడు... పొప్పర్లు రేగిపోయి పుండడిపోయింది. ఎట్ట నడుస్తున్నాడో ఆడి తాత దరమరాజుకే తెలాలా," అన్నాడు.

ఒరియా వాళ్లకి భాష అర్థం కాలేదు. అయినా బాధ అర్థం అయింది. అక్కడి అందర్లోనూ ఒకే దు:ఖం ప్రవహిస్తోంది. అది స్వర్ణచతుర్భుజ జాతీయ రహదారుల మీదా రైలు పట్టాల మీదా దిక్కులేని అనాథ పక్షిలా పారాడుతూ ఉంది.

సీతాన్వేషి మెల్లిగా లేచాడు. అతడి మోకాళ్లు పొలంలో గడ్డిమొక్కల్లా ఊగిపోతున్నాయి. లేచి నిలబడి పదినిమిషాలు ఉండి కళ్లు తెరిచి విజయ వంక చూసి, "నీరసానికో... దప్పిక్కోగానీ బుర్ర తిరిగిపోయింది బుల్లీ..." అన్నాడు. అని, "సరె పదండ్రా..." అని కాలు ఎగరేస్తూ అడుగు వేశాడు. కిరణ్ అతని పక్కకెళ్లి చేతిని తన భుజం మీద వేసుకుని నడిపిస్తున్నాడు.

మోటారుసైకిలు మీద వచ్చిన కుర్రాడు అన్నాడు, "అయన్ని బండెక్కించేండి..." అని ఇంకో కుర్రాడితో, "అన్నా నువు ఈ తాతని తీసుకెళ్లి మళ్లీ రా... అందాకా నేను ఈళ్లతో వస్తుంటా..." అన్నాడు.

ఒరియా కుర్రాళ్లు సైకిళ్లు ఎక్కి బయలుదేరారు. రెండు రోజుల్నించీ సరైన తిండిగానీ నీళ్లుగానీ దొరకలేదు వాళ్లకి. ఎంత దూరం సైకిళ్లు తొక్కుతున్నా రోడ్లమీద కొట్లు కూడా తీసి ఉంటం లేదు.

అక్కడక్కడ కొంతమంది కుర్రాళ్లు చిన్న టెంట్లు వేసి ఏదో ఒక ఆహారాన్ని పళ్లనీ యిస్తున్నారు. అదేదో ఊళ్లో పోలీసులు లాక్‌డౌన్‌లో తిరుగుతారా... అని కర్రతో కొడితే ఎలాగో తప్పించుకున్నారు. కానీ ఒకడికి మాత్రం రెండు మూడు దెబ్బలు గట్టిగా తగిలేశాయి. భారంగా తొక్కుతున్నారు. వాళ్లతోపాటే ఈ గుంపు కూడా నడుస్తోంది. పిల్లల్ని మెళ్ల మీద ఎక్కించుకుని అడుగులు వేస్తున్నారు. దూరంగా టెంట్ కనిపించింది. అక్కడ అన్నం నీళ్లు ఉన్నాయి. సీతాన్వేషి చేతిలో ప్లేటుతో కూర్చొని తింటుండడం కనిపిస్తోంది.

సైకిల్ మీద వెళ్తున్న కుర్రాళ్లలో ఒకడు పడిపోయాడు. మిగిలిన ఇద్దరూ సైకిళ్లు దిగి గమ్మున అతణ్ణి లేపారు. వేలబడిపోతున్నాడతడు. టెంట్ దగ్గర ఉన్నవాళ్లలో ఇద్దరు నీళ్ల బాటిళ్లు తీసుకుని పరిగెత్తుకుంటూ వచ్చారు. రోడ్డు పక్కన గడ్డిలో పడి ఉన్నాడు అతను. ముఖంమీద నీళ్లు జల్లారు. పెద్దగా వాంతి అయినట్టు కెక్కరించాడు. నీళ్లు తప్ప ఏమీ రాలేదు. రెండు మూడుసార్లు ఓకరించి వేలబడిపోయాడు.

నీళ్లు తెచ్చినవాళ్లలో ఒకడు, “వడదెబ్బ తగిలినట్టుంది,” అని, “నీళ్లు తాగించ కండి..” అంటూ తెచ్చిన బాటిల్ నీళ్లని ముఖం మీదా... గుండెల మీదా జల్లాడు.

కిరణ్, విజయ.. హారిక... అందరి ముఖాలు నీరింకిపోయిన చెరువులా బీటలు వారిపోయాయి. గుండె కొట్టుకుంటున్న చప్పుడుకి చెవులు గళ్లడిపోతున్నాయి. కిరణ్ తల విదిలించి, “మీరెందుకిక్కడ.. ఆడికి పొండి,” అని అరిచాడు. అందరూ పిల్లల్నెత్తుకుని టెంట్‌లోకి పరిగెట్టారు. గబగబా డ్రమ్ముల్లో నీళ్లు తీసుకుని తాగుతున్నారు. ప్లేట్లు తీసుకుని అన్నం పెట్టించుకుంటున్నారు.

“ఎవళ్లమ్మా పడిపోయింది,” అడిగాడు సీతాన్వేషి.

విజయ అతని వంక చూసింది. దగ్గరగా వెళ్లి పక్కనే కూర్చుని గొంతు నొక్కుకుని, “ఆ ఒరియా వాళ్లలో ఒకడు చిన్నాయినా... అలా తొక్కుతూ... తొక్కుతూ చూస్తుండగానే పడిపోయాడు... పెద్దగా వాంతైపోయింది. సోయిలో లేడు. ఆళ్లిద్దరూ ఆళ్ల బాసలో ఏదో అంటున్నారు. కానీ ఏమీ అర్థమవడం లేదు. పాపం...” అంటోంది.

సీతాన్వేషి అటువైపు చూశాడు. కిరణ్ ఇద్దరు ఒరియావాళ్లూ... ఇక్కడి వాళ్లు ఉన్నారక్కడ.. పడిపోయినతను లేవలేదు.

ఎవరో ఏమిటో తెలియదు. ఊరూ తెలియదు... ఊసూ తెలియదు. ఇక్కడ ఈ దారిలో ఏల మనకి కండ్ల పడినాడో... ఏ యమ్మ కన్నబిడ్డో... అనుకున్నాడు సీతాన్వేషి. అతని కళ్లలో నీళ్లు చిప్పిల్లాయి. వూరిలో కాలవ గట్టున నులక మంచంలో

పడి తన వంక చూపులేని కండ్లతో చూస్తూ వూపిరిడిసిన తల్లి గుర్తుకొచ్చింది. ఎవరిని తలుచుకున్నాడో... ఆ కుర్రవాడు. అతని చెంపల మీద కన్నీరు ధార కట్టి గడ్డంలోకి యింకిపోయింది.

టెంటులో అందరూ నిశ్శబ్దంగా అన్నాలు తింటున్నారు. నీళ్ల పాకెట్లని సంచుల్లో వేసుకుంటున్నారు.

ముఖమైనా తెలియని ఆ మనిషి గుండెల్లో కొండలా పెరిగిపోతున్నాడు.

కిరణ్ వచ్చాడు. ప్లేటులో అన్నం పెట్టించుకుని సీతాన్వేషిని చూస్తూ...

"పెద్దాడా... దరమరాజు వెంట సునకమువలె మరణము వచ్చినది... కానీ..." అని అగాడు... ఆగి, "ఊళ్లో బతుకు లేక పట్టణానికి పోయాం. పట్నంలో చావుకి భయపడి వూరికి పోతున్నాం. చావుకీ బతుక్కీ వూగులాడ్డం తప్ప మనకి జీవితమే లేకుండపోయింది..." అన్నాడు ఏడుపు రాసిన గొంతుతో...

ఆ గొంతుకి విజయ తిరిగి చూసింది.

సీతాన్వేషి మెల్లగా లేచాడు. తినకుండా ప్లేటులో చేయి పెట్టి ఉండిపోయిన కిరణ్ వీపు నిమురుతూ ఉండిపోయాడు.

"నాలుగు రోజుల్నించీ తిండి లేదు. మనతో కలిసి అడుగులు వేసినోడు... అలా పడుంటే బూ తినబుద్ధి కాట్లేదురా... పెద్దాడా..." అని ప్లేటుని మడిచి విసిరేశాడు కిరణ్.

*సాక్షి ఫన్ డే*
*4 అక్టోబర్ 2020*

*



**అద్దేపల్లి ప్రభు** 15 అక్టోబర్ 1963న కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జన్మించారు. మొదటి కథ విలువలు 1984లో అరుణతారలో అచ్చయింది. దాదాపు ముప్ఫై కథలు రాశారు. సీ మాన్ కథాసంపుటి ప్రచురించారు. నాలుగు కవితా సంపుటాలు ప్రచురించారు. తెలుగు ఉపాధ్యాయుడుగా తూర్పు గోదావరి జిల్లాలో పనిచేస్తున్నారు.

*చిరునామా: 15-7బి-7ఎస్2, గాంధీభవన్ వీధి, వెంకటరత్నపురం*
*కాకినాడ- 533001, తూర్పు గోదావరి జిల్లా.*
*ఫోన్: 98489 30203* **prabhuakkd@gmail.com**